వదినెగారి సానుభూతి

ఎస్. ఎన్. ప్రభల

పోయిన సంక్రాంతి సెలవులకు కవిటం వెళ్ళిన గురుమూర్తి మొన్ననే తిరిగి వచ్చాడు. కన్నవారింటివద్దనుంచి వచ్చాడేమో రెండురోజులయినా ప్రయాణ బడలిక యింకా తీరలేదు. కారణం వేరే ఏమీ లేకపోయినా కాలేజీకి సెలవు పెట్టి నిన్నటి డైరీ చూస్తూ కూర్చున్నాడు.

భర్త ఆక్షీసుకు వెళ్ళిపోయిన తర్వాత ఉన్న పనులన్నీ ముగించుకుని హాలులోకి వచ్చిన శారద మరిది గురుమూర్తిని చూసి ఆశ్చర్యపోయింది. అంటే, మొద్దబ్బాయిలా బడీగిడీ ఎగకొట్టేసి ఇంట్లో కూర్చున్నాడని కాదు...ఆ వాలకమన్న మాట శారదనట్లా నిలవేసి వేస్త!

అంటే—!

ఆ క్షణంలోనే పూర్వ మెప్పుడో, ఎప్పుడో ఏమిటి ... ఇటీవల గురుమూర్తి విషయంలో తనకుకలిగినఅనుమానం స్ఫురణకొచ్చింది. ఆ విషయాన్ని కాస్త ఆధారంగా తీసుకుని యీ పెద్దమనిషి సంగతి చూడాలి!

కథానిక

"ఏమోయ్ గురూ! విన్నావా? మరేమోనే, —అవున్లే మొన్ననేగా వచ్చావ్, వచ్చినప్పటి నుంచీవీధి మొగం చూస్తేనా!"

ఈవిడగా రేదో విశేషం చెప్పబోతోందన్న భావంతో ప్రశ్నార్థంగా గురుమూర్తి శారదవైపు తిరిగాడు.

"అదేమిటోయ్! ఏవిటా వాలకం? వెర్రి వాడిలా అట్లా చూస్తావేం?"

"అబ్బ! నన్నుచంపక చెప్పేదేదైనా ఉంటే చప్పున కానీయ్ వదినా!"

"బాగుంది బాబూ...బాగుంది! హఠాత్తుగా చెబితే ఎక్కడి నీ బక్క గుండె ఆగిపోతుందోనని నే ననుమానిస్తూంటే!"

"సరేలే! నీ యిష్ట మొచ్చినప్పుడే చెప్పు. నా మనసు సరిగాలేదు. కోతలు కోసిమాత్రం నన్ను చంపేయకు."

"ఛా-చ! చిన్నవాడివి. మంచి బాలుడివి. బుద్ధిమంతుడవు పైపెచ్చు పైకి రావడానికి ప్రయత్నిస్తున్నవాడివి. యింకాయింకా..."

"వ...ది...నా..." దీనంగా!

"అవున్నాయనా...అవునవును. అందుకే—"

"అబ్బబ్బబ్బబ్బా—"

"సరేలే ... నాకేం ... మూడు ముక్కల్లో చెప్పేస్తాను. సావిత్రి..."

సావిత్రి పేరు వినగానే గురుమూర్తి ఉలిక్కిపడ్డాడు.

—అదంతా ఓ పూర్వగాథ. జరిగి చాలా కాలం అయినా ఆ ప్రస్తావన వచ్చినప్పుడల్లా గురుమూర్తి అట్లాగే ఉలుకులికి పడుతూంటాడు.

తాను ఇంటర్ పరీక్ష డింకీలు కొట్టేటందుకు ప్రకటించేటందుకు - నాందిగా గురుమూర్తి కేమీ తెలీకుండానే సావిత్రి అతని గుండెల్లో యిట్టే ఒక మహత్తర మైన స్థానాన్ని సంపాదించింది.ఆమె విషయమై పాపం...చాలా విపరీతంగా వూహించేవాడు! "సావిత్రి!" అని తరచు మనసారా అనుకుని ఏమిటేమిటో అయిపోయేవాడు. యాతావాతా చివరికి తేలిందేమిటయా అంటే తన ప్రతిరక్తకణం "సావిత్రీ...సావిత్రీ!" అని కుతకుతలాడిపోతోంది. తానామెను ప్రే...మి...స్తు...న్నా...డు!

కాని—

గురుమూర్తి విషయంలో సావిత్రి గగనకుసుమం అయిపోయింది. అడపాదడపా ఒకటీ—రెండూ అవకాశా 'లందుకు' అనుకూలంగా వచ్చినా ... ఆలోచించుకునేటందుకు టైంలేక తాను పాడుచేసుకున్నాడు. అందీ అందనట్లుగానే ఉండీఉండీ ఒక్కసారిగాపోయి కూర్చుంది అనంతాకాశంలోకి...అసలందకుండాను!

అంటే పెద్ద ఏమీలేదు. సావిత్రిని పెళ్ళాడాలంటే తాను కనీసం ఓపెద్ద డాక్టరైనా కావాలి

(తాను యా'గండాలన్నీ'గడిచి డాక్టరై వచ్చేసరికి ఆ అమ్మాయి అమ్మమ్మై కూర్చుంటుంది!) అందుకే ఆమె విషయం అతిప్రయాసపడి అహోరాత్రాలూ విలవిలలాడుతూనే...విస్మరిం...

ఇంతకన్న మఱేది గతాన్ని తవ్వుకుందుకు వ్యవధి యివ్వడం భావ్యంకాదనుకుంది శారద.

"ఏమిటి గురూ, తీవ్రంగా ఆలోచిస్తున్నట్లున్నావ్?"

"ఏంలేదోదినా. ఏదో చెప్పపోయి ఆగిపోయావ్?"

"అదా ... సావిత్రి విషయం. నీదాకా వచ్చిందో లేదో అని!"

"బాగుందమ్మోయ్. ఈ ఆడవాళ్ళందరి విషయాలూ ఆలోచిస్తూ కూర్చోవడమే ననుకుంటున్నావేమిటి నా పని!"

శారదకు తెలుసు...నిజంగా అట్లా కూర్చోవడం అతనివల్ల కాదని. అందరి విషయం మాటెందుకూ...ఒక్క సావిత్రి విషయంలోనే—"ఈవాళ యీ రంగుచీర కట్టింది—నాకు చాలా బాగుంది. ఈచీర క్రితం"టెరమ్"లో అసలు కట్టలేదేం చెప్మా! ఆబొట్టు కాస్త చిన్నది పెట్టుకుంటే ఆవిడ భారతీయతకేమైనా ఆటంకం వస్తుందేం?రోజూ కాటుక పెట్టుకుని వచ్చేది—యివాళ అదేం పాపం!" యిట్లా ఆలోచించుకుంటూ వెధవ యింటర్ ఆరు ఛాన్సులు చూసాడు. ఇక ఆడవాళ్ళందరి విషయాలూ పట్టించుకుంటూ కూర్చుంటేనా...!

ఈ విషయం మళ్ళీ అంటే బాధపడకపోడని... "ఛాఛా...ఇంకోరి గొడవా యింకోరి గొడవా అయితే నీకెందుకు చెబుతానోయ్! సావిత్రి సాక్షాత్తూ నీ మాజీప్రేయసి కనక!"

గురుమూర్తి విసుక్కున్నాడు.

"అవచ్చు. ఇంతకీ తమరనేదేవిటి?"

"వాళ్ళ వాళ్ళు పాపం సావిత్రికి పెళ్ళి చేయడానికి పూనుకున్నారట!"

"పాపమా! ఇంకో పదే ళ్ళట్టేపెట్టుకోవాలంటావా?"

"ఆ అబ్బాయ్ ఈ వూర్లోనే ప్లీడరీ చేస్తున్నాట్ట!"

"పోనీలే. డాక్టర్ కాకపోతే ప్లీడర్ హోదా. నిన్ను పిలిచారా పెళ్ళికి?"

"సరే. ఆ పిల్ల నాకొద్దీపెళ్ళి మైగాడ్ అంటూ ఆ ప్రస్తావన వచ్చినప్పుడల్లా నూతిదగ్గరకు పరిగెడుతూంటే..."

"అం...టే..."

"అంటే ఏముందీ. శుభలేఖలు కొట్టించారంటే సూయీసైడ్! అంటోందట. అసలు విషయం నాకు తెలిసిందనుకో."

గురుమూర్తి అనుమానంగానే ... "కొంపదీసి ప్రేమలోగానీ పడలేదుగదా?"

శారద చిన్నపిల్లలా తప్పట్లు కొడుతూ—

"సరిగా అదే జరిగింది. ఆ ముద్దుగుమ్మ సరిగ్గా నీలాంటి కుర్రాడినే ఒకడిని చాలాకాలం క్రితమే ప్రేమించిందట. (గురుమూర్తి నరనరాలా విద్యుత్తు ప్రవహించింది!) అతని చదువు సంధ్యలు సావిత్రి అమ్మ వాళ్ళకూ సరిపడలేదు. సొసైటీలో వాళ్ళ స్టేటస్ ఆ పిల్ల నాన్నా వాళ్ళకీ సరిపడలేదు. అమ్మా నాన్నా...అంతా కలిసి ఒక్కసారిగా నాన్సెన్స్! ఇట్లా జరగడానికి వీలులేదని తీర్మానించారట!"

శారదకొంచెంసేపాగింది. గురుమూర్తితాలూకు ఉద్వేగం ఆ జాప్యాన్ని సహించలేక పోతోంది. ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

శారద మళ్ళీ చేతులు తిప్పుకుంటూ అందుకుంది—

"ఆ అబ్బాయికూడా తనను ప్రేమిస్తున్నాడని గ్రహించిందట సావిత్రి. ఇహనేం అనుకుందట. తన తలిదండ్రుల వ్యతిరేకత తెలుసుకున్న ఆ అబ్బాయి ఖచ్చితంగా వాళ్ళనెదిరించి సివిల్ మారేజీ చేసుకుంటాడని ఎదురుచూసిందట. సివిల్ మారేజీ మాట దేవుడెరుగు...నాందీగా చిన్న చీటీముక్క పంపే సత్తాకూడా లేకపోయిందట ఆ పిల్లాడికి."

గురుమూర్తి పెదవులు తడుపుకుని...

"ఇదంతా నీ కెవరుచెప్పారోదినా?" అని సమాధానం కోసం చెవులు రిక్కించాడు.

శారద విసుగ్గా—

"ఎవళ్ళు చెబుతారేమిటి? ఇలాంటి విషయాలు వాళ్ళూ వీళ్ళూ చెబితే నేను నమ్ముతానేమిటి?

ఆ పిల్లకూ నాకూ ఉన్న స్నేహంకొద్దీ సావిత్రే చెప్పింది."

గురుమూర్తి "హుం..." అనుకున్నాడు.

"ప్రతిరోజూ రెండుఝామ్లా తిరిగితిరిగి తనను చూసి చిరునవ్వులు చిందించి పోతూంటాట్ట! తన కేమో పిలిచేటందుకు ధైర్యం చాలదట! అక్కడికీ తెగించి ఓ రోజున ఎగ్జిబిషన్‌లో ధైర్యంచేసి చేయూపుతే..బెదిరిపోయి ఆ అబ్బాయి ఎక్కడో ఉన్న తన తండ్రిని చూపించి ముక్కుమీద వేలేసుకుని వెళ్ళిపోయాట్ట! తనకేమో వళ్లుమండిపోయిందట! దాంతో ఫక్తు ఏడాదిపాటు అతనెంతతిరిగినా ఎన్ని పడిగాపులు పడినా తనముఖం చూపించలేదట! ఐనా స్త్రీ హృదయం. తన హృదయంలో అతగాడు రెడ్డిగంవేసుక్కూర్చున్నాడు. రెండో వ్యక్తి కాలూనడాని కామెమనసొప్పుకోదట!"

ఓ నిముషం ఆగి దీర్ఘంగా శ్వాస తీసుకుంది శారద. మళ్ళీ వరదలై పారుతూన్న సానుభూతితో-

"—లోలోపల కుతకుతలాడుతూన్న అగ్ని పర్వతం ఒక్కసారిగా బద్దలయిందట. తనతండ్రి పైవారులో పెళ్ళని డిక్లేర్ చేశాట్ట!"

గురుమూర్తికి ముచ్చెమటలు పోశాయి. గురుమూర్తి ఆపాదమస్తకం కంపించి పోతున్నాడు.

బొంగురుపోయిన గొంతుకతో తడబడుతూన్న మాటలతో..."వ...ది...నా"— అని మాత్రం అనగలిగాడు.

శారద యిదేమీపట్టించుకోకుండా సీరియస్‌గా-

"పాపం రాత్రి ఆ పిల్ల మనింటికివచ్చి కళ్ళు కాలువలు కట్టేలా గుండె తరుక్కుపోయేలా విల విలా- విలపించింది.

నాకు మాత్రం చెప్పొద్దూ ... అతగాడిమీద కోపం వచ్చింది సుమీ! అంత చాతకానివాడు, అంత సత్తాలేనివాడు ఆ మాత్రం అత్యవసర సమయంలో నైనా స్వతంత్రించలేనివాడు-ఏం-గురూ ఆ పిల్ల నెందుకు రెచ్చగొట్టాలీ అంట? ప్రశాంతంగా ఉన్న ఆమె పసిహృదయంలో కోర్కెలనెందుకు రగుల్కొలపాలీ అంట! ఆ చికిలిచూపులూ, ఆ వెకిలి నవ్వులూ ఎందుకూ అంట! అంతట్రాజెడీయే కావాలనుకునే పెద్దమనిషి ఏ సినిమా తారనో ప్రేమించక సామాన్య సంసారుల జోలికి ఎందుకు పోవాలీ అని నాకు పట్టుకుంది. వీళ్ళచదువూ... వీళ్ళ కల్చరూ ఏవంటావ్ గురూ..."

గురుమూర్తి ఏమంటాడూ...అతని పరిస్థితి చాలా విపరీతమైన దశలో ఉంది. ఏంచెబితే ఏమొస్తుందో!

ఆవిడింతగా చెబుతోంది అబద్ధమైయుండదు.

ఇంజనీరింగ్ కోర్సు

ఏ. ఎం. ఐ. ఇ. (ఇండియా) పరీక్షకు చదివి ప్యాసుకండి. ఇది ఇంజనీరింగులో యూనివర్సిటీ డిగ్రీకి సమానమైనదిగా గవర్నమెంటు వారిచే రికగ్నైజు కాబడింది. ఈకోర్సు కాల పరిమితి మూడు సంవత్సరాలు. లెక్కలు, ఫిజిక్సు, కెమిస్ట్రీతో ఇంటర్మీడియట్ పరీక్ష ప్యాసైన అభ్యర్థులు ప్రవేశమునకు అర్హులు. హాస్టలుకూడా కలదు. ప్రాస్పెక్టసుకు, దరఖాస్తు ఫారముకు పన్నెండు అణాలు మణిఆర్డరుద్వారా ప్రిన్సిపాల్, మద్రాసు కాలేజి, చింతాద్రిపేట, మద్రాసు-2. అడ్రెసుకు పంపండి. మణి ఆర్డరు కూపనులో మీ పేరు, అడ్రెసు విడి విడి అక్షరాలలో వ్రాయండి, (పోస్టల్ ట్యూషన్ లేదు.)

సి. జి. బిందు మాధవరావు, బి.ఎస్.సి.,బి.ఇ.,ఎ.ఎం.ఐ.ఇ. (ఇండియా). ప్రిన్సిపాలు.

కాలేజి ప్రారంభం **25-6-56** తేదీ

ఆ క్రితంరాత్రి తను ఎరుమిదింటికే పడుకున్నాడు. అన్నయ్య ఆఫీసునుంచీ అట్లాగే సినిమాకు వెళతానన్నాడు. పదకొండు గంటలదాకా వచ్చి ఉండడు. అయితే సావిత్రి ఈ లోపుగావచ్చి ఉంటుందా? ఎంత యిదైనా తననుగురించి తన వదినతోటే యింత ధైర్యంగా చెప్పి ఉంటుందా...ఆఁ... అయినా ఆఖరి గడియల్లో ఆ మాత్రం ధైర్యం చేయకపోతే ఎట్లామరి?

సావిత్రికి తాఁనెంతో అన్యాయం చేసాననుకున్నాడు గురుమూర్తి వేయి జన్మలు దాస్యంలో మగ్గినా అందుకు ప్రాయశ్చిత్తం పూర్తికాదనుకుని కుంగిపోయాడు గురుమూర్తి. ఎగ్జిబిషన్ అంటుందేమిటీ వదిన? ఆమె ఉత్సాహాన్నీ ఆమె ఆశలనీ గూకటివ్రేళ్ళతో పెల్లగించి సర్వనాశనం చేసాడు తను!

"సా ... వి ... త్రీ ...—" అనుకున్నాడు గురుమూర్తి.

శారద సంస్కారానికీ, విశాల హృదయానికీ ఉబ్బొంగి పోయాడు గురుమూర్తి. మనసులోనే వేయి నమస్కారాలర్పించాడు వదినగారికి. సావిత్రి పట్ల తా ననుసరించిన నీచాతినీచమైన విధానాన్ని, తన చాతకాని తనాన్నీ మాతృవాత్సల్యంతో ఎంత సహనంతో పాయింట్ చేసింది!

ఈ కృతజ్ఞతా భావంతో ఒక్కసారి నిండుగా "వ...ది...నా..." అన్నాడు కళ్ళురెండూ గట్టిగా మూసుకుంటూ!

శారద అంటుకుంది, మఱేది అనుభూతులతో తనకేమీ సంబంధం లేనట్లుగా—

"అప్పుడు నేను మాత్రం ఏం చేయగలనూ? చెప్పాను. 'అమ్మాయీ...యీ ప్రేమల్లో ఉన్న కష్టసుఖాలు నాకూ తెలుసు. సత్యనారాయణగారిని నేనూ ప్రేమించే పెళ్ళాడాను. కాని నీ విషయంలో అది చేయి మించిపోయింది. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లోనే మనను మనం నిలదొక్కుకోవాలి. వెనుకముందు లాలోచించాలి! వర్తమానాన్ని బాగా మననం చేసుకోవాలి! చేయి కాలిన తర్వాత ఏం పట్టుకుంటే ఏం లాభం? ఖర్మం అని మొత్తుకు ఛస్తేమాత్రం ఏంలాభం?' విధి నీ విషయంలో ఎదురు తిరిగింది. అబలవైన నువ్వు... కానీ సంపాదించలేని అతనితో కట్టుగుడ్డలతో పోయి కాల ప్రవాహానికి ఎదురీద లేవుగదా! అత నెవరో నాకు తెలీదాయె. నే చెప్పగలిగిన దేమిటంటే, నీ ఐంతకీ పెట్టి పుట్టలేదనుకో. నీ ప్రేమ త్యాగం కోరింది. కాని ఆవేశాలకు పోయి జీవితాన్ని పాడుచేసుకోకు సావిత్రీ!"

పర్వత శిఖరాగ్రంనుంచి తన నెవరో త్రోసివేస్తున్నట్లు ఫీలవుతున్నాడు గురుమూర్తి. ఆ ఆవేశంలోనే "వ...ది...నా..." అన్నాడు. ఒక్క క్షణం ఆగి శారద మళ్ళీ అందుకుంది:

"అవును. నే నంతకన్న ఏంచేస్తాను? సావిత్రి ఆ అబ్బాయి యెవరో చెప్పదాయె! అంతగా చెప్పి ఆ పిల్లను ఒప్పించి ఆ మనసు మార్చేసరికి రాత్రి పదకొండు గంటలయింది. ఇంతలో మీ అన్నయ్య రావడం సావిత్రి వెళ్ళడం..."

గురుమూర్తి ఉడికుడికిపోతూ...తన మానుతూన్న గాయాన్ని కత్తితో దొలిచి ఎవరో కారంజల్లినట్లు బాధపడుతూ..."సావిత్రినోయింటిదాన్ని చేసావిన్నమాట. ఆమె మనస్ఫూర్తిగా అతన్ని పెళ్ళాడేటందు కొప్పుకుందా వదినా?"

"మహరాజులా! వ్యామోహంలోపడి కొట్టుకుపోతూన్న నన్నొక దరికి చేర్చారండీ అంటూ బొంగిపోయింది. ఇరుగుపొరుగులచేతా ఆత్మబంధువులచేతా వేలెత్తి చూపించుకోవలసిన అధోగతి పట్టకుండా నా జీవితాన్ని నందవనం చేసారండీ అంటూ వేయి నమస్కారాలుచేసి మరీ వెళ్ళింది!"

గట్లనధిగమించి వరదలై వస్తూన్న దుఃఖాన్ని దిగమింగుకుని, వణుకుతున్న పెదవుల్ని బిగపట్టుకుని, నిటారుగా నిలబడి కంపించిపోతూనే అడిగాడు గురుమూర్తి....."ఇదంతా నిజమేనా వదినా?" అని!

"నిన్నాడించడాని కన్నానోయ్! బాధపడకు! సావిత్రీ లేదు గీవిత్రీ లేదు బుద్ధిగా చదువుకో. బి. ఏ. కూడా ప్రేమలోపడి డింకీలు లంకించుకున్నావంటే నీ మొహమెవరూ చూడరు..." వచ్చే నవ్వాపుకుంటూ లోపలికొక్క పరుగు తీసింది శారద.

నిలువునా కుంగిపోయాడు గురుమూర్తి— భరింపశక్యంకాని సిగ్గుతో.

★